క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొవ్వూరు విద్యార్థులు



దుర్గాప్రసాద్, పి.వెంకటేష్‌లతో హెచ్‌ఎం పద్మశ్రీ, పీఈటీ భాస్కర్

కొవ్వూరు: అండర్–13 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు డి.దుర్గాప్రసాద్, పి.వెంకటేష్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.పద్మశ్రీ శనివారం తెలిపారు. త్వరలో కడపలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారిద్దరూ పాల్గొంటారని చెప్పారు. దుర్గాప్రసాద్, వెంకటేష్‌లకు శిక్షణ ఇచ్చిన పీఈటీ ఎస్.భాస్కర్‌ను ఆమె అభినందించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ పి.కవిత, ఇతర ఉపాధ్యాయులు ఇద్దరు విద్యార్థులను అభినందించారు.

పేదలకు బియ్యం పంపిణీ



కాపవరంలో పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మల్లిపూడి ట్రస్టు ప్రతినిధులు

కొవ్వూరు: మండలంలోని కాపవరం గ్రామంలో శనివారం మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు ద్వారా 30 మంది నిరుపేదలకు 15 కిలోల బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధి మల్లిపూడి ధనరాజు చేతుల మీదుగా వాటిని అందజేశారు. తమ ట్రస్టు తరఫున అనాథ శవాలకు మట్టి ఖర్చుల కింద రూ.5 వేలు అందజేస్తున్నామని తెలిపారు. నిస్సహాయ స్థితిలో ఉన్న కొందరికి మెడికల్ పింఛను కింద రూ.300 నుంచి రూ.800 వరకూ అందిస్తున్నామన్నారు. మట్టా సుబ్బారావు, సాకా పుల్లారావు, గెల్లా భాస్కరరావు, అయినా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు శ్రేష్టం

నిడదవోలు రూరల్: శిశువు పుట్టిన వెంటనే తల్లి పాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి జి.సుధీర్‌కుమార్ అన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతపై మండలంలోని కంసాలి పాలెం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.

వివక్ష లేకుండా అన్ని వర్గాలకూ సంక్షేమం

- హోం మంత్రి తానేటి వనిత
- సూరయ్యపేటలో గడప గడపకూ..

తాళ్లపూడి: వివక్ష లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని అన్నదేవరపేట పంచాయతీ శివారు సూరయ్యపేట గ్రామంలో శనివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో హోం మంత్రి వనిత గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారాని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ ఎలిపే సుధారాణి, అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణ దేవరాయలు, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు సిద్ధంశెట్టి కృష్ణ, నాయకులు కుంటముక్కల కేశవనారాయణ, కొమ్మిరెడ్డి పరశు రామారావు, ఎంపీడీవో వెంకటరమణ, సర్పంచులు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

వరద తగ్గినా బురద తొలగించరే



బురదగా గోష్పాద క్షేత్రం రహదారి

- జారి పడుతున్న వాహనదారులు
- గోష్పాద క్షేత్రంలో రాకపోకలకు ఇబ్బంది

కొవ్వూరు: ఇటీవల సంభవించిన గోదావరి వరద ముంపు వల్ల గోష్పాద క్షేత్రంలోని రోడ్లపై ఒండ్రు మట్టి పేరుకుపోయింది. ఇప్పటికీ ఆ మట్టిని తొలగించక పోవడంతో ఈ క్షేత్రానికి వస్తున్న భక్తులు ప్రమాదాలకు గురవుతున్నారు. శనివారం మోటార్ సైకిల్‌పై వస్తున్న తండ్రీకూతురు జారి పడ్డారు. ఈ ప్రమాదంలో వారిద్దరూ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వరద తగ్గిపోయి నాలుగైదు రోజులైనప్పటికీ రోడ్లను శుభ్రం చేయక పోవడం విమర్శలకు తావిస్తోంది.మునిసిపల్ అధికారులు స్పందించి తక్షణం రోడ్లపై ఉన్న బురద తొలగింపునకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. నిత్యం ఈ క్షేత్రంలోని ఆలయాలకు, అపర కర్మల నిర్వహణకు నిత్యం వందలాది మంది విచ్చేస్తుంటారు. కనీసం క్షేత్రానికి వచ్చే భక్తుల రాకపోకలకు అనువుగానైనా మట్టిని తొలగించాలని కోరుతున్నారు. ఇప్పటికే పట్టణంలోని పలు ఆలయాల వద్ద మేటలు వేసిన ఒండ్రు మట్టిని ఆయా ఆలయాల నిర్వాహకులు, అర్చకులు స్వచ్ఛందంగా తొలగించుకుని శుభ్రం చేసుకున్నారు. కాగా శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లపై పేరుకుపోయిన ఒండ్రు మట్టి మళ్లీ బురదగా మారింది.



గోష్పాద క్షేత్రం రోడ్డులోని ఒండ్రు మట్టిపై జారి పడిన వాహనదారుడు

రైతు సంక్షేమానికి ఎనలేని కృషి

వాగల్లు: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని మార్కొండపాడు సొసైటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి వనిత హాజరయ్యారు. సొసైటీ అధ్యక్షుడిగా గంగిశెట్టి వీర వెంకట రమణమూర్తి (వాసు), డైరెక్టర్లుగా తాడేపల్లి శ్రీనివాసరావు, అంబటి మురళీమోహన్‌లతో సొసైటీ కార్యదర్శి పి వరలక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన పాలకవర్గాన్ని మంత్రి వనిత అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జక్కంపూడి గణేష్, ఏఎంసీ చైర్మన్ వలభశెట్టి గంగాధర శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఆత్మ చైర్మన్ గండ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, సర్పంచ్ కె.లక్ష్మీ శివపోశి, రైతులు పాల్గొన్నారు.



మార్కొండపాడు సొసైటీ పాలకవర్గాన్ని అభినందిస్తున్న మంత్రి తానేటి వనిత

పార్టీ కోసం పనిచేసే వారందరికీ గుర్తింపు

- హోం మంత్రి తానేటి వనిత
- శ్రీరామ సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ భరత్‌రామ్. చిత్రంలో మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: కష్టపడి పనిచేసే నాయకులందరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని శ్రీరామ సొసైటీ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 14 సొసైటీలు ఉన్నాయన్నారు. పార్టీ కోసం కష్ట పడుతున్న వారికి దశల వారీగా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించామన్నారు. పదవులు కొందరికే ఇవ్వగలుగుతామన్నారు. నాయకులు, కార్యకర్తలకు జగనన్న ప్రభుత్వంలో తగిన గుర్తింపు ఎప్పుడూ ఉంటుందన్నారు. బాధ్యతలు స్వీకరించిన త్రీమెన్ కమిటీ చైర్మన్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, సభ్యులు బోడపాటి హనుమంతరావు, గోశాల శ్రీనివాసరావులను మంత్రి అభినందించారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ త్రీమెన్ కమిటీ సభ్యులు, చైర్మన్ రవీంద్రతో ప్రమాణ స్వీకారం చేయించారు. రాజమహేంద్రవరం సిటీ మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరరావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు మాట్లాడారు.నూతన పాలకవర్గాన్ని నాయకులు ఘనంగా సత్కరించారు. ఆత్మ చైర్మన్ గండ్రోతు సురేంద్ర, పార్టీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు రుత్తల భాస్కరరావు, సుంకర సత్యనారాయణ, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, చాగల్లు మండలశాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, జుట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైల్వే జంక్షన్ అభివృద్ధికి శంకుస్థాపన

నిడదవోలు: నిడదవోలు రైల్వే జంక్షన్ అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేస్తారు. ఇందు కోసం అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 గంటలకు స్టేషన్ ఆవరణలో బహిరంగ సభ నిర్వహిస్తారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ హాజరు కానున్నారు. తొలి విడతగా దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.27 కోట్ల వ్యయంతో నిడదవోలు రైల్వే జంక్షన్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించనున్నారు. రైల్వేస్టేషన్ ముఖ భాగంలో ఎలివేషన్, స్టేషన్‌లోని 01, 02, 03 ప్లాట్‌ఫారాల్లో 200 మీటర్ల మేర ఫ్లోర్ మొత్తం గ్రానైట్‌తో ఆధునీకరిస్తారు. ప్రయాణికుల రాకపోకలకు వీలుగా ఈ ప్లాట్‌ఫారాల్లో మూడు ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులు నిర్మిస్తారు. స్టేషన్‌లో రాజమహేంద్రవరం వైపు ఆక్సిజన్ పార్కు వద్ద 12 మీటర్ల వెడల్పుతో ఎండ్ టు ఎండ్ ఫుట్ పాత్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తారు.

కమ్యూనిటీ భవనానికి రూ.6 లక్షలు

దేవరపల్లి: అసంపూర్తిగా ఉన్న దేవరపల్లిలోని క్షత్రియ కమ్యూనిటీ భవన నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలు మంజూరు చేసినట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. క్షత్రియ సంఘం ప్రతినిధులు శనివారం ఎంపీపీ కేవీకే దుర్గారావును కలిసి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు ప్రతినిధులు ఎంపీపీ దుర్గారావుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీ నిధులు మంజూరు చేశారు.

7న చంద్రబాబు పోలవరం పర్యటన

కొవ్వూరు: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈ నెల 7న పోలవరం ప్రాజెక్ట్ సందర్శనకు విచ్చేస్తున్నారని ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ ప్రకటించారు. టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని శనివారం దొమ్మేరులోని ఇంద్రప్రస్థ జీఎల్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని, పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పార్టీ కొవ్వూరు టౌన్, మండల శాఖల అధ్యక్షులు దాయిన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామన పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

నిడదవోలు: రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయుర్వేద వైద్యురాలు కొల్లిపర శ్రీవిద్య రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందించారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పొలదాసు శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, వైద్య శిబిరం దాత ఉప్పులూరి వీరభద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నిడదవోలు: పట్టణంలోని లింగంపల్లి మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సెంట్రల్ రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. రోటరీ వృద్ధాశ్రమ అధ్యక్షుడు బీఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శి నీరుకొండ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై ర్యాలీ

గోపాలపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని హుకుంపేట, అన్నదేవరపేట పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అన్నదేవరపేట పీహెచ్‌సీ పరిధిలోని 19 ఏళ్ల లోపు వయస్సు గల 5,009 మందికి, హుకుంపేట పీహెచ్‌సీ పరిధిలోని 8,878 మందికి నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తామన్నారు. డాక్టర్ శ్రీనివాస్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల: ఈ నెల 10న నిర్వహించే నులి పురుగుల నివారణ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్టు నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు తెల్లం గంగాధరరావు తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ పోస్టర్‌ను ఎంపీడీఓ ఎం.రాజశేఖర్ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. 19 ఏళ్ల లోపు బాల బాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలు ఉచితంగా అందిస్తారని, వాటిని తప్పనిసరిగా వేయాలని ఎంపీడీఓ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు వై.సత్యనారాయణ, బి.భగవతీదేవి, సీహెచ్‌ఓ పి.ప్రసాదరావు పాల్గొన్నారు.



నల్లజర్లలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ రాజశేఖర్, ఇతర అధికారులు

పెరవలి: నులి పురుగుల నివారణ పోస్టర్‌ను ఎంపీడీవో దామోదరరావు స్థానికమండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. వైద్యాధికారి కృష్ణవేణి, సీడీపీఓ శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఎంఈఓ పాల్గొన్నారు.

భీమోలులో తాటాకిల్లు దగ్ధం



కాలిపోయిన తాటాకిల్లు

గోపాలపురం: మండలంలోని భీమోలు గ్రామంలో ముప్పిడి బుజ్జి అనే వ్యక్తి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు ముప్పిడి బుజ్జి తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంటి చుట్టూ సంచరించారని, తానంటే గిట్టని వారే శనివారం తెల్లవారుజామునే ఈ దారుణానికి పాల్పడ్డారని ఆరోపించాడు. వీఆర్వో కె సూర్యారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. సుమారు రూ. రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు చెప్పారు. దీనిపై గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు బుజ్జి తెలిపారు.

గృహ నిర్మాణాలు వెంటనే చేపట్టండి

దేవరపల్లి: జగనన్న లే అవుట్లలో వెంటనే గృహ నిర్మాణాలు ప్రారంభించాలని హౌసింగ్ ఏఈ ధర్మారావు లబ్ధిదారులకు సూచించారు. దేవరపల్లిలోని మూడు గ్రామ సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు స్థానిక ఆర్‌బీకేలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షత వహించారు. ఏఈ ధర్మారావు మాట్లాడుతూ జగనన్న కాలనీలో 1095 గృహాలు మంజూరయ్యాయన్నారు. కాలనీలో నీటి వసతి కల్పించినందున, నిర్మాణాలు ప్రారంభించి పునాదులు కట్టాలని సూచించారు. నిర్మాణాలు ప్రారంభించిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. మండలంలోని త్యాజంపూడి, సంగాయగూడెం, గౌరీపట్నం సీతమ్మ చెరువు వద్ద గల లే అవుట్లలో గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని ధర్మారావు చెప్పారు. లబ్ధిదారులే గృహాలను సొంతంగా కట్టుకోవాలన, ప్రభుత్వం కట్టించి ఇవ్వదని స్పష్టం చేశారు. సదస్సులో క్షేత్రస్థాయి సిబ్బంది, గ్రామ సచివాలయ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉసులుమర్రులో ఫ్యామిలీ డాక్టర్

పెరవలి: మండలంలోని ఉసులుమర్రు గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కానూరు పీహెచ్‌సీ డాక్టర్ పి. తేజశ్రీ సుమారు 100 మంది సాధారణ రోగులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే 16 మంది గర్భిణులను, 42 మంది బీపీ పేషెంట్లకు, 68 సుగర్ వ్యాధిగ్రస్తులను కూడా పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కాగా ఉసులుమర్రుకు చెందిన గర్భిణి నక్కా సౌమ్యకు స్కానింగ్ అవసరమైంది. అందుకు అవసరమైన రూ.రూ.2550 ఆర్థిక సాయాన్ని మండల రథసారథుల కన్వీనర్ సూరిబాబు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరమళ్ళ దుర్గ, సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు పరిసరాల్లో రూ.550 కోట్ల టర్నోవర్

- యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ సీవీఎన్ భాస్కరరావు
- పట్టణంలో ఖాతాదారుల అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ ఫీల్డ్ జీఎం భాస్కరరావు

నిడదవోలు: పట్టణపరిసర ప్రాంతాల్లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల ద్వారా రూ.550 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని ఆ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ సీవీఎన్ భాస్కరరావు పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల అవగాహన సదస్సును శనివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భాస్కరరావు మాట్లాడుతూ కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా వ్యవసాయదారులకు అన్ని రకాల పంట రుణాలను అందిస్తున్నామన్నారు.రైతులకు రూ.1.60 లక్షల వరకూ ఎలాంటి హామీ లేకుండా పంట, టూ వీలర్, త్రీ వీలర్, కారు ఇతర రవాణా వాహనాల రుణాలు ఇస్తున్నామన్నారు. ఆ బ్యాంక్ భీమవరం రీజినల్ హెడ్ వి.సంగీతకుమారి మాట్లాడుతూ బ్యాంక్ నిడదవోలు రైల్వే స్టేషన్ రోడ్ శాఖలో లాకర్ల ఏర్పాటుకు, పాటిమీద సెంటర్లో ఏటీఎం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఖాతాల్లో కనీస నిల్వ రూ.15,000 ఉండే ఖాతాదారులకు బ్యాంకు బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, డీఆర్‌హెచ్ఆర్ దివాకర్, ఎన్వీబీ రమణ, ఇందు, బ్యాంక్ నిడదవోలు శాఖల మేనేజర్లు సంతోష్, నవీన్, చాగల్లు బ్రాంచ్ మేనేజర్ రామారావు పాల్గొన్నారు.

పథకాల పేరుతో ఆ వర్గాలకు అన్యాయం

గోపాలపురం: భారతీయ జనతా పార్టీని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తుంటే ఆయా వర్గాల ఓటర్లను వివిధ పార్టీలు పథకాల పేరుతో మోసగిస్తున్నాయని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి అన్నారు. ఆ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి సిర్రా భరత్ అధ్యక్షతన శనివారం గోపాలపురంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పరంజ్యోతి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఓటర్లు విజ్ఞతగా వ్యవహరించాలని కోరారు. పార్టీ కార్యకర్తలను దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు వారా ప్రభాకర్, సోలరాజు, కొవ్వాదయ్య అరుణ్‌కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై క్రైస్తవుల శాంతి ర్యాలీ

దేవరపల్లి: మణిపూర్‌లో ఇటీవల గిరిజన క్రైస్తవులపై జరిగిన దాడులను మండలంలోని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలకు నిరసనగా నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్, ఏపీ పాస్టర్స్ ప్రేయర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం దేవరపల్లిలో నిరసన శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి మొదలైన ఈ ర్యాలీ బస్టాండ్ వరకూ సాగింది. మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలని, కూల్చిన క్రైస్తవ మందిరాలను తిరిగి నిర్మించాలని, క్రైస్తవులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలంటూ వారు నినాదాలు చేశారు. అనంతరం వారు స్థానిక క్యాంపు కార్యాలయంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కలిసి వినతిపత్రం అందజేశారు.